సాక్షి అనకాపల్లి

గురువారం । 20 । జూన్ । 2024



'చెరువు కాలువ కప్పి రోడ్డు వేశారు'

రాజాం గ్రామంలో వెంకటరావు చెరువు కాలువను కప్పేయడంపై గ్రామ రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. 8లో



దేవస్థానం భూముల వేలం రేపు

దేవరాపల్లి, రోలుగుంట మండలాల్లోని దేవస్థానాల భూముల కౌలుకు ఈ 21న టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నారు. 8లో



ఘనంగా తిరువీధి ఉత్సవం

ఇనుకకొండపై వెలసిన రమా సహిత సత్య నారాయణ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తిరువీధిని ఘనంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

నేడు, రేపు బీసీ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష



జిల్లా కన్వీనర్ వెంకటరెడ్డి

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు మహాత్మా జ్యోతీరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, నర్సీపట్నం గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. 20న 6,8 తరగతుల విద్యార్థులకు, 21న 7,9 తరగతుల విద్యార్థులకు విశాఖలోని సింహాచలం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకుని, పరీక్షకు హాజరు కావాలని ఆయన సూచించారు.

టేకు ప్లాంటేషన్ పనుల పరిశీలన



ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రాఫ్

గొలుగొండ: మండలంలోని నిమ్మగెడ్డ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న టేకు ప్లాంటేషన్ పనులను నర్సీపట్నం ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్ రాఫ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా టేకు ప్లాంటేషన్ ఏర్పాటు చేయడం వల్ల అటవీశాఖకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. అటవీశాఖ భూములున్న ప్రాంతాల్లో టేకు ప్లాంటేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణదేవిపేట రేంజర్ వెంకటరమణ, గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

7న నేవీ మారథాన్ ట్రయల్ రన్

విశాఖ స్పోర్ట్స్: ఆరోగ్య కరమైన జీవనశైలి సందేశాన్నిస్తూ వైజాగ్ నేవీ మారథాన్(వీఎన్‌ఎం)లో భాగంగా సన్నాహక పరుగు పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో డిసెంబర్ 15వ తేదీన ఈ పరుగు విశాఖ సాగర తీరంలో జరగనుంది. ఇందులో భాగంగా జూలై 7వ తేదీన సన్నాహక పరుగు నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలి ఎడిషన్ గత నెల 2వ తేదీన నిర్వహించగా దాదాపు 250 మంది పరుగు పెట్టారు. రెండో ఎడిషన్‌గా జూలై 7వ తేదీన నిర్వహించే ఈ పరుగులో పాల్గొనేందుకు www.vtra.run వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. మూడో ట్రయల్ రన్ ఆగస్టు 4వ తేదీన జరగనుంది. మొత్తంగా ఐదు ట్రయల్ రన్స్ నిర్వహించనున్నారు.

ఖరీఫ్ కలవరం

రెండు జిల్లాలు.. నాలుగు నియోజకవర్గాలు.. 52 వేల ఎకరాలు. వీటన్నింటికీ ఆధారం తాండవ జలాశయం. ఈ నీటిపైనే ఆయకట్టు రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో సాగునీటి సరఫరాపై సందిగ్ధత నెలకొంది. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా.. అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- తాండవ కాలువల్లో చేపట్టని పూడిక తీత పనులు
- గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కి
- కొత్తగా నిధులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశం
- ఖరీఫ్ సాగుపై ఆయకట్టు రైతుల్లో ఆందోళన



తాండవ ఎడమ కాలువలో పేరుకున్న పూడిక



తాండవ కుడి కాలువలో పేరుకుపోయిన పూడిక

నాతవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా తాండవ ప్రాజెక్టు పరిధి ఆయకట్టు కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మేజర్ ప్రాజెక్టు తాండవ జలాశయం. ఏటా ఖరీఫ్ సీజన్లో తాండవ నీటి ఆధారంగానే అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, పాయకరావుపేట, కాకినాడ జిలాలోని తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధి 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారు. ప్రాజెక్టు పరిధిలో చిన్నా, పెద్ద కాలువలు 120 కి.మీ. పొడవున ఉన్నాయి. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే తాండవ ప్రాజెక్టు అధికారులు ఈ కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేసేవారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన కాలువులో ఎక్కడా నేటికీ పూడిక తీత పనులు చేయలేదు. ఈ పనులు జరిగితేగానీ శివారు ఆయకట్టుకు నీరందే పరిస్థితి ఉండదు.

గత ప్రభుత్వంలో రూ.6.50 కోట్లు మంజూరు

గతేడాది తాండవ ఆయకట్టు పరిధిలో కాలువల్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో టెండర్ల ప్రక్రియ జరగలేదు. దీంతో పనులు మొదలవలేదు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పూర్తిగా ప్రక్రియ మూలకు చేరింది. కోడ్ ముగిశాక పనులు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులకు సంబంధించి పనులు చేయరాదని రాష్ట్ర ఇరిగేషన్ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో పనులకు బ్రేక్ పడింది. దీంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కి మళ్లాయి. సీజన్ సమీపిస్తున్నా పూడిక తొలగింపు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఏటా పూడిక తీత పనులు మార్చి నెలాఖరున ప్రారంభించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే జూన్ నాటికి పూర్తి చేస్తారు. ఈ ఏడాది పూడిక పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో, ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకమేనని అధికారులు చెప్తున్నారు.



తాండవ కాలువలో పూడికను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు(ఫైల్)

అడుగంటిన తాండవ నీటి మట్టం

ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా పరిధిలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో తాండవ నీటి మట్టం పూర్తిగా అడుగంటింది. ప్రాజెక్టు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా, డెడ్ స్టోరేజీ 345 అడుగులు. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 355 అడుగులు మాత్రమే ఉంది. రుతుపవనాలు ప్రవేశించి 20 రోజులవుతున్నా వర్షాల్లేవు. రానున్న నెల రోజుల్లో భారీ వర్షాలు కురిసి, తాండవలో నీరు చేరితేనే ఆయకట్టుకు ఖరీఫ్ వరి సాగుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో వరి పంటను నాతవరం మండంలోనే సాగు చేస్తారు. దీంతో ఈ ఏడాది సాగు ఏ విధంగా సాగుతుందోనన్న అయోమయంలో రైతులు ఉన్నారు.

రూ.5.20 కోట్లతో ప్రతిపాదనలు



ఉన్నతాధికారుల నుంచి కొత్తగా వచ్చిన ఆదేశాల మేరకు తాండవ కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టేందుకు కొత్తగా ప్రతిపాదనలు రూపొందించాం. ఇందుకు రూ.5.20 కోట్లు అవసరమవుతుందని లెక్క తేలింది. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరయ్యాక ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పూడిక తొలగింపు పనులు చేపడతాం.

– బి.స్వామినాయుడు, ఈఈ, ఇరిగేషన్ శాఖ

యువ శాస్త్రవేత్త శిరీషకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం



రాష్ట్ర గవర్నర్ చేతులు మీదుగా అవార్డు, గోల్డ్‌మెడల్ అందుకుంటున్న శాస్త్రవేత్త శిరీష

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లికి చెందిన అవుగడ్డ బేగం మేరీ శిరీషకు రాష్ట్ర స్థాయి ఉత్తమ యువ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బుధవారం జరిగిన 56వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ఐకార్(ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ (న్యూఢిల్లీ) డాక్టర్ హిమాన్షు పాటక్, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని స్వీకరించారు. బంగారు పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈమె ప్రస్తుతం యలమంచిలి మండలం కొక్కిరాపల్లి అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. శిరీష రాష్ట్ర ఉత్తమ పురస్కారంతో పాటు గోల్డ్ మెడల్‌ను అందుకోవడం పట్ల మారేపల్లిలోని ఆమె తల్లిదండ్రులు అవుగడ్డ అప్పలనాయుడు, సత్యవతితో పాటు ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

శిక్షణకు జూ క్యూరేటర్

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా డిపార్ట్‌మెంటల్ శిక్షణ కోసం వెళ్లారు. నెలరోజుల పాటు న్యూఢిల్లీ, భోపాల్‌త దితర ప్రాంతాల్లో ఇచ్చే శిక్షణలో ఆమె పాల్గొంటారు. ఇందుకోసం ఆమె ఈ నెల 16న విశాఖనుంచి బయలుదేరి వెళ్లారు. ఆమె వచ్చే వరకు జూ క్యూరేటర్(ఎఫ్ఏసీ)బాధ్యతలను అడిషనల్ క్యూరేటర్ జి.మంగమ్మకు అప్పగించారు.

కమతాలు, పంటల వారీగా సాగు వివరాల సేకరణ



వ్యవసాయ గణన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప సంచాలకులు సౌజన్య

- రెండో దశ వ్యవసాయ గణనపై శిక్షణలో అర్థ గణాంక శాఖ డీడీ సౌజన్య

తుమ్మపాల: వ్యవసాయ గణనలో భాగంగా కమతాలు, పంటల వారీగా సాగు వివరాలు నమోదు చేయాలని అర్థ గణాంక శాఖ ఉపసంచాలకులు కె.సౌజన్య సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండవ దశ వ్యవసాయ గణన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021–22 సాగు సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ గణనలో మండల స్థాయిలో సహాయ గణాంకాధికారులు, గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు ప్రాథమిక కార్యకర్తలుగా, మండల సహాయ గణాంకాధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని చెప్పారు. ముందుగా వ్యవసాయ గణన ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు మాట్లాడుతూ వ్యవసాయ గణనకు సంబంధించి ఇన్‌పుట్ సర్వేలో రైతుల విద్యార్హతలు, వారు వినియోగించిన పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రైతు బీమా, రైతు తీసుకున్న వ్యవసాయ రుణాలు తదితర వివరాలను సేకరించాలన్నారు. ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో కచ్చితత్వంతో కూడిన వివరాలను కేంద్ర ప్రభుత్వ మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. కార్యక్రమంలో గణాంకాధికారి ఎస్.శ్రీరామమూర్తి, ఉప గణాంకాధికారులు, జిల్లాలోని సహాయ గణాంకాధికారులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ):

జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 21 శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. హెటెరో ల్యాబ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, గ్లాడియేటర్ సెక్యూరిటీ సర్వీసెస్, జాబ్ డీలర్స్, హ్యూమన్ పవర్ సర్వీసెస్, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 461 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. రిసెప్షనిస్ట్, అకౌంటెంట్ ట్యాలీ, హౌస్ కీపింగ్, ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్ ఆపరేటర్ ట్రైనీ, టెక్నీషియన్లు, ట్రైనీ, హెల్పర్స్, సర్వీస్ ట్రైనీ, మెకానిక్ హెల్పర్లు, సెక్యూరిటీ గార్డ్స్, గ్రాఫిక్ డిజైనర్స్ తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18–35 ఏళ్ల వయసున్న పురుష, మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.12 వేల నుంచి రూ.28 వేల వరకు జీతం ఉంటుందని.. ఆరోజు 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని సుబ్బిరెడ్డి తెలిపారు.

అధికారులను దూషించడం సరికాదు

- అయ్యన్నకు మాజీ ఎమ్మెల్యే గణేష్ హితవు



మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను దూషించడం సరికాదని.. తప్పు చేస్తే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హితవు పలికారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా రోడ్డు ఎంత బాగా వేశామో లేదో చూడాలి తప్ప ఆర్‌అండ్‌బీదా, మున్సిపాలిటీదా అన్నది ముఖ్యం కాదన్నారు. అధికారులను నడిరోడ్డుపై నిలబెట్టి దూషించడం వల్ల వారి కుటుంబ సభ్యులు ఎంత బాధపడతారో అర్థం చేసుకోవాల్సిన అవసరం అయ్యన్నపాత్రుడుకు ఉందన్నారు. స్పీకర్‌గా బాధ్యతలు చేపడుతున్న అయ్యన్నపాత్రుడు హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేకపోతే చర్యలు తీసుకోవాలి తప్ప అధికారులను దూషించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. స్పీకర్‌ను కాబోతున్నా తప్పు చేసిన అధికారులను అసెంబ్లీలో నిలబెడతానని అయ్యన్నపాత్రుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారులను అసెంబ్లీలో నిలబెట్టడమనేది దేశ చరిత్రలో లేదన్నారు. అనేక పర్యాయాలు మంత్రిగా పని చేసిన అయ్యన్నపాత్రుడు ఆరిల్లోవ రోడ్డు విస్తరణకు అటవీ అనుమతులు తీసుకు రావడంలో విఫలమైతే తాను అటవీ అనుమతులు తీసుకొచ్చి రోడ్డు విస్తరణ చేశానన్నారు. మున్సిపాలిటీలోని మెయిన్ రోడ్డును కొంత మేరకు వంద అడుగులకు విస్తరించినట్టు చెప్పారు. ప్రత్యామ్నాయ రోడ్డును కిలో మీటరున్నర విస్తరించామన్నారు. మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ తీసుకువచ్చామన్నారు. వీటిన్నింటినీ అయ్యన్నపాత్రుడు అభివృద్ధి చేస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. ఏ నమ్మకంతో ప్రజలు మిమ్మల్ని గెలిపించారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలు అమలుపై దృష్టిసారించాలని సూచించారు.

మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లారని చెప్పారు. గత ప్రభుత్వం 6 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే 50 వేల పోస్టులు ఖాళీగా ఉంటే 6 వేల పోస్టులు భర్తీ చేయడమేమిటని టీడీపీ నాయకులు మాట్లాడారని, ఇప్పుడు మెగా డీఎస్సీ పేరుతో కేవలం 16 వేల పోస్టులు భర్తీ చేస్తామనడం నిరుద్యోగులను మోసం చేయడమేనని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



చోడవరంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్ (ఇన్‌సెట్) నర్సీపట్నంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

చోడవరం రూరల్: అత్యధిక సంఖ్యలో పెండింగ్ కేసులను పరిష్కరించడం ద్వారా ఈనెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ కోరారు. బుధవారం స్థానిక కోర్టుల సముదాయంలో న్యాయవాదులు, పోలీసులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి న్యాయవాదులు, పోలీసులకు ఇదొక చక్కని అవకాశమని గుర్తు చేశారు. ప్రధాన సివిల్ జడ్జిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న లోక్ అదాలత్ కమిటీ చైర్మన్ ఇ.రాజేంద్రబాబు మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పునకు ఉన్న ప్రత్యేకత ప్రాధాన్యతలను కక్షిదారులకు తెలియపరిచి ఇరు వర్గాలు కేసుల పరిష్కారానికి మొగ్గు చూపేలా చేయాలన్నారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడుతూ వందలాది పెండింగ్ కేసులకు పరిష్కారం దొరికితే ఇటు న్యాయవాదులు, అటు పోలీసులతోపాటు మరో వైపు కోర్టులకు పనిభారం తగ్గుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నందున ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ కోరారు. అనకాపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ మాట్లాడుతూ పోలీసు పరంగా తమ వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. సీఐ శ్రీనివాసరావు, సర్కిల్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసుల పరిష్కారం మేలు

నర్సీపట్నం: రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుంటేనే మేలు జరుగుతుందని, ఈ విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. ఈ నెల 29న దేశవ్యాప్తంగా జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని పోలీసు అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. ఇరువర్గాలకు మేలు చేకూరుతుందన్న విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నేతన్న నేస్తానికి మంగళం !

- మేనిఫెస్టోలో ప్రకటించని టీడీపీ
- సంక్షేమ పథకాలు కొనసాగిస్తామంటూ చంద్రబాబు ప్రగల్భాలు
- ఈ ఏడాది ఆర్థికసాయం అందే అవకాశం లేదని నేతన్నల్లో ఆందోళన
- కులవృత్తి వదిలి కూలికి వెళ్లాల్సిందేనా అంటూ ఆవేదన
- నేతన్నలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా రూ.24 వేల ఆర్థిక సహాయం
- ఐదేళ్ల పాటు ఆదుకున్న జగన్ సర్కార్



నక్కపల్లిలో వస్త్రాలు నేస్తున్న నేతన్నలు

నక్కపల్లి : నేతన్నకు మళ్లీ కష్టాలు మొదలయినట్టే. గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకానికి చంద్రబాబు సర్కారు మంగళం పాడినట్టే. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో నేతన్న నేస్తం పథకం గురించి ప్రస్తావన లేకపోవడంతో నేత కార్మికుల్లో ఈ అనుమానాలు, ఆందోళన మొదలయ్యాయి. ఈ ఏడాది అందాల్సిన ఆర్థిక సాయం ఇక రాదన్న భయాందోళనలు వారిలో వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మగ్గానికి మంచిరోజులు వచ్చాయి. కులవృత్తికి దూరమైన నేతన్న వైఎస్సార్‌సీపీ సర్కారు ఇచ్చిన ఆర్థిక సాయంతో మగ్గం బాట పట్టాడు. కూలిపనులకు వెళ్లే నేతన్న జగనన్న సర్కారు ఇచ్చిన ఆర్థిక సాయంతో కులవృత్తిని చేసుకుంటూ ఆనందంగా గడిపాడు. భార్యాభర్తలు ఇద్దరూ కష్టపడి ప్రభుత్వ సాయంతో వస్త్రాలు తయారు చేస్తూ రోజుకు రూ.1000 పైనే సంపాదించుకునే వారు. ప్రభుత్వం మారింది. పథకాలు మారుతున్నాయి. వీటి జాబితాల్లో నేతన్న నేస్తం పథకం కూడా చేరింది. దీంతో నేతన్నల్లో ఆందోళన మొదలైంది.

పాదయాత్ర ద్వారా చేనేత కార్మికుల కష్టాలు స్వయంగా తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నేత కార్మికులకు పెట్టుబడి సాయంగా నెలకు రూ.2వేల చొప్పున ఏటా రూ.24 వేలు ఒకే విడతలో జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నేతన్న నేస్తం పథకాన్ని అమల్లోకి తెచ్చారు. మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికి ఏటా రూ.24 వేల చొప్పున జమ చేయడానికి చర్యలు చేపట్టారు. దీంతో కులవృత్తికి దూరమై కూలి పనులు చేస్తూ జీవనం గడిపే నేతన్నలంతా తిరిగి మగ్గం బాట పట్టారు. చేనేత కార్మికులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసా చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకు వచ్చింది. జిల్లాలో 17(చోడవరం, వేములపూడి, నక్కపల్లి, గొడిచర్ల, బంగారయ్యపేట, గొడిచర్ల, పాయకరావుపేట, బూరుగుపాలెం, నర్సీపట్నం, కోటవురట్ల, గుండుపాల, రోలుగుంట, ఏ కోడూరు, యలమంచిలి, ఎంబీ పట్నం, కొత్తపేట, సీహెచ్‌ఎల్ పురం) చేనేత సహకార సంఘాలున్నాయి. 60 వేలకుపైగా చేనేత సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారు. సుమారు 324 కుటుంబాలు మగ్గాలు కలిగి నేతన్న నేస్తం పథకానికి అర్హత సాధించాయి. ఒక్క పాయకరావుపేట నియోజకవర్గంలోనే 130 మందికి పైగా లబ్ధిదారులున్నారు. వీరందరికీ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి విడత నేతన్న నేస్తం సాయం కింద 2019 అక్టోబరులో రూ.24 వేలు, రెండో ఏడాది 2020 జూన్‌లోను, 2021 జూన్ 10న మూడో విడత, 2022 ఆగస్టులో నాలుగో విడత ఇలా వరుసగా ప్రతి ఏడాది ఆర్థిక సాయాన్ని జమ చేసింది. ఈ సొమ్ముతో చేనేత కార్మికులు ముడిసరకు కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందారు. ప్రస్తుత ప్రభుత్వం నేతన్న నేస్తం గురించి ప్రస్తావించలేదు. ప్రత్యామ్నాయంగా మగ్గాలు వాడే కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తానని మాత్రమే హామీ ఇచ్చింది. ఈ హామీ మాకేమాత్రం ఉపయోగపడదని, నగదు రూపంలో ఇస్తే తాము ముడిసరకు కొనుగోలు చేసి కులవృత్తిని చేసుకుంటామని నేతన్నలు చెబుతున్నారు. ఈ ఏడాదినుంచి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే అవకాశాలు సన్నగిల్లడంతో నేతన్నల్లో ఆందోళన మొదలైంది. మళ్లీ మగ్గం వదిలి కూలిబాట పట్టాల్సిన పరిస్థితులు రానున్నాయని వారు వాపోతున్నారు.

పథకాన్ని కొనసాగించాలి

గత ప్రభుత్వంలో మాకు ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందింది. ఈ నిధులతో ముడిసరకు కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందాం. కులవృత్తిని కాపాడుకున్నాం. చంద్రబాబు ప్రభుత్వం నేతన్న నేస్తం పథకానికి బదులు ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారు. దీని వల్ల మాకు పెద్దగా ఉపయోగం ఉండదు. ప్రతినెలా పెట్టుబడికోసం సాయం అందిస్తేనే మగ్గాలు నేసే పరిస్థితి ఉంటుంది. అప్పు చేసి పెట్టుబడి పెట్టే పరిస్థితి ప్రస్తుతం లేదు. ఈ పథకాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాం.

–అప్పలరాజు, నేత కార్మికుడు, నక్కపల్లి

పునరాలోచించాలి

నేత కార్మికులను ఆదుకుని కులవృత్తిని కాపాడిన నాయకుడు జగనన్న. చతికిల పడిన చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చి వలసపోయిన నేతన్నలను తిరిగి మగ్గం బాట పట్టేలా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు సర్కారు ఈ పథకానికి పేరు మార్చి అయినా సరే కొనసాగిస్తే బాగుంటుంది. పెట్టుబడి సాయం చేయకుండా ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పడం భావ్యం కాదు. నేతన్న నేస్తం పథకంపై పునరాలోచన చేసి కొనసాగిస్తే చేనేత రంగం అభివృద్ధి చెందుతుంది. ఆర్థిక సాయం చేయకపోతే నేతన్నలంతా మళ్లీ మగ్గాలకు దూరమయ్యే పరిస్థితులు నెలకొంటాయి.

– ఎల్లేటి సత్తిబాబు, చేనేత సామాజికవర్గ నేత, నక్కపల్లి

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల విజేత విశాఖ



గెలుపొందిన క్రీడాకారులతో శారద సూర్యనారాయణ తదితరులు

రాంబిల్లి : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సాధ్యపడుతుందని గోకివాడ సర్పంచ్ నీరుకొండ శారద సూర్యనారాయణ అన్నారు. లోవాంబిక అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం రాత్రి కప్‌లు, నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. వీరికి కప్‌తో పాటు రూ.20వేలు నగదును అందజేశారు. తగరపువలస జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, వీరికి కప్‌తో పాటు రూ.15వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ద్వారపురెడ్డి నానాజీ, పాట్నూరు శివశంకర్, యలమంచిలి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుదిరెడ్డి అప్పారావు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

చలన చిత్ర కార్మికులకు ఈశ్రమ్ నమోదు

సీతంపేట (విశాఖ): ఈశ్రమ్ కార్డు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సాయం నేరుగా పొందేందుకు అవకాశం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్‌ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తోరంరాజా అన్నారు. చలన చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఈశ్రమ్ కార్డు నమోదు కార్యక్రమాన్ని బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్రమ్ కార్డు ఉంటే హెల్త్ కార్డులు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. చలన చిత్రపరిశ్రమ కార్మికులు అందరూ ఈశ్రమ్ కార్డు నమోదు చేసుకోవాలని కోరారు. ఏపీమా అధ్యక్షుడు ముత్తుకూరు నరసింహులు, ప్రధాన కార్యదర్శి సలాది అచ్యుత రామస్వామి, విశాఖ జిల్లా అధ్యక్షుడు భయ్యా శ్రీనివాసరావు, కోశాధికారి పూల శ్రీను, కార్యదర్శి విజయరమణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• ఈ-పోర్టల్‌లో స్టార్ రేటెడ్ ఉత్పత్తులు

ఇంధనం ఆదా

- ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఈపీడీసీఎల్
- దేశంలోనే తొలి డిస్కమ్‌గా ఈపీడీసీఎల్
- స్టార్ రేటెడ్ గృహోపకరణాలు నేరుగా కొనుగోలు చేసే అవకాశం



ఈఈఎస్ఎల్ మార్ట్ వెబ్‌సైట్



ఒప్పంద పత్రాలతో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్

సాక్షి, విశాఖపట్నం : ఇంధన వనరుల ఆదా, పర్యావరణ పరిరక్షణలో ఎప్పటికప్పుడు గేర్ మార్చుతూ ఎనర్జీ ఎఫిషియన్సీలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేలా దూసుకుపోతున్న ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) మరో వినూత్న ఆవిష్కరణకు నాంది పలికింది. విద్యుత్ వినియోగదారులకు నేరుగా స్టార్ రేటెడ్ గృహోపకరణాలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్‌తో జతకట్టింది. తమ పోర్టల్ ద్వారా నేరుగా ఇంధన సామర్థ్య ఉత్పత్తుల్ని అందించనుంది. ఈ మేరకు ఈఈఎస్ఎల్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

డిస్కమ్‌లతో ఈఈఎస్ఎల్ జత

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థల జాయింట్ వెంచర్ అయిన ఈఈఎస్ఎల్ అత్యాధునిక ఇ-కామర్స్ పోర్టల్ ఈఈఎస్ఎల్ మార్ట్‌ని ఇటీవలే ఆవిష్కరించింది. ఈ కామర్స్ ప్లాట్ ఫామ్‌లో ఎల్‌ఈడీ బల్బుల నుంచి బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్ల వరకూ విస్తృతమైన స్టార్ రేటెడ్ ఉత్పత్తుల శ్రేణి విక్రయించేలా పొందుపరిచారు. ఇంధన వనరుల పరిరక్షణకు దోహదపడే ఉత్పత్తుల సమాహారంగా ఈ ప్లాట్‌ఫామ్.. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలనుకునే ప్రజలకు దోహదపడుతోంది. అయితే ఈ వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు డిస్కమ్‌లతో జతకట్టాలని ఈఈఎస్ఎల్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈపీడీసీఎల్‌తో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఈఈఎస్ఎల్ సీఈవో విశాల్ కపూర్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లినా.. బిల్లులు చెల్లించే సమయంలో వాట్సప్ ద్వారా, ఎస్ఎంఎస్ ద్వారా ఈకామర్స్ సైట్ లింక్‌ని వినియోగదారులకు అందజేయనున్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించే సౌకర్యాన్ని కల్పించడంతో సరఫరా గొలుసుని క్రమబద్ధీకరిస్తూ సరసమైన ధరల్లో స్టార్ రేటెడ్ ఉత్పత్తులను ఈపీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులకు అందజేయడమే తమ లక్ష్యమని సీఈవో విశాల్ కపూర్ స్పష్టం చేశారు.

ఇంధన వినియోగంలో విప్లవాత్మక మార్పు

ప్రస్తుతం 33 శాతం శక్తిని ఆదా చేసే 9 వాట్స్ బల్బులు, ఇన్వర్టర్ బల్బులు, 40 శాతం తక్కువ విద్యుత్‌ని ఖర్చు చేసే 5 స్టార్ ఫ్యాన్‌లు మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇలాంటి ఉత్పత్తుల వినియోగం ద్వారా ఇంధన పొదుపులో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని విశాల్‌కపూర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధన పరిరక్షణలో తిరుగులేని శక్తిగా భారత్‌ని ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్న లక్ష్యంతో తొలి అడుగు విశాఖ నుంచి వేస్తున్నట్లు తెలిపారు. ఒకే ప్లాట్‌ఫామ్‌పై ఉత్పత్తులు, సేవలు, ఫైనాన్సింగ్‌ని తీసుకురావడమే కాకుండా పర్యావరణ స్పృహ పై దేశంలోని ప్రతి పౌరుడికీ బాధ్యత కల్పించేలా అవగాహనతో పాటు ప్రాథమిక విధిగా మార్చే దిశగా ప్రయాణం సాగిస్తున్నామని వివరించారు. డిస్కమ్‌లతో కలిసి లైఫ్ మిషన్‌కు మద్దతునిస్తూ స్ట్రీట్‌లైటింగ్, ఎల్‌ఈడీ వినియోగం వంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్ని సమష్టిగా నిర్వహిస్తున్నామని విశాల్ కపూర్ వివరించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వినియోగాల్ని పరిగణనలోకి తీసుకుంటూ సున్నాకు కర్బన ఉద్గారాల నియంత్రణ లక్ష్యాలకు అనుగుణంగా సంపూర్ణ సహకారం అందించేలా అద్భుతమైన మార్పులకు నాంది పలుకుతున్నామన్నారు. ఈ పరికరాలు కొనుగోలు, వినియోగం ద్వారా దేశంలో 20 శాతం వరకూ విద్యుత్‌ని ఆదా చేస్తే.. ఏడాదికి రూ.74 వేల కోట్లు విలువైన ఇంధనాన్ని ఆదా చేయగలమని విశాల్ కపూర్‌తో పాటు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కన్నబాబురాజు, సూర్యనారాయణరాజు

- ఎంఎస్ఎంఈ మాజీ చైర్మన్ డీవీఎస్‌రాజు
- తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌తో భేటీ

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని సమీక్షించుకోవడంతో పాటు, నియోజకవర్గాల్లో కార్యకర్తలను కాపాడుకోవడమే తక్షణ కర్తవ్యమని ఎంఎస్ఎంఈ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత బుధవారం ఆయన తాడేపల్లిలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని యలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజుతో పాటు కలవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాయకరావుపేట,యలమంచిలి నియోజకవర్గాల్లో ఓటమిని, పార్టీ పరిస్థితిని గురించి జగన్ ఆరా తీసారన్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసినప్పటికీ ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. అమలు సాధ్యం కాని హామీలు ఇవ్వకపోవడం వల్లే ఓటమి చెందడం జరిగిందన్నారు. ఓటమిని సమీక్షించుకోవడంతో పాటు కార్యకర్తలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జగన్‌కు తెలియజేయడం జరిగిందన్నారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రజాతీర్పును గౌరవిస్తూ అధికార పార్టీకి అవకాశం ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రతిపక్ష పార్టీగా తమ వంతు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ గ్రామ స్థాయిలో పార్టీ బలంగా ఉందన్నారు. పార్టీ శ్రేణులంతా ఐకమత్యంగా ఉంటూ అధికార పార్టీ వేధింపులను ఎదుర్కోవచ్చన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు సరైన గుర్తింపు ఇవ్వడంతోపాటు, వారికి అండగా నిలిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి మనోధైర్యం కల్పించడంతో పాటు, పార్టీని మరింత బలోపేతం చేసే చర్యలు అధిష్టానం చేపడుతుందని అధినేత జగన్‌మోహన్ రెడ్డి తెలియజేసారన్నారు. పార్టీని నడిపించేందుకు మండలాల వారీగా సమర్థులైన నాయకులను ఎంపిక చేసే ఆలోచన పార్టీ చేస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ ఉన్నారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం



స్వామి వారి తిరువీధి ఉత్సవం



ఘాట్‌రోడ్డు మీదుగా సాగుతున్న తిరువీధి ఉత్సవంలో మహిళల కోలాటం

డాబాగార్డెన్స్(విశాఖ) : ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరువీధి రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి రథయాత్ర చేపట్టారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి రథయాత్ర ఘాట్‌రోడ్డు, పూర్ణామార్కెట్, పోలీస్ బ్యారెక్స్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సత్యనారాయణస్వామి ఆలయం వరకు సాగింది. దారి పొడవునా కోలాటం.. సంకీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బుద్ధ నాగజగదీష్ పర్యవేక్షించారు.

నేడు వైదిక సదస్యం..

దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, 9 గంటలకు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) చేపట్టనున్నారు.

దేవస్థానం భూముల కౌలుకు వేలం రేపు



చిన నందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థానం

దేవరాపల్లి : మండలంలోని చిననందిపల్లిలో ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థాన భూముల కౌలుకు ఈ 21న టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో టి.ఎస్.ఎస్. శర్మ తెలిపారు. చిననందిపల్లిలో సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలు, సర్వే నంబర్ 112లో 5.03 ఎకరాలు మొత్తం 8.40 ఎకరాలు దేవస్థానం భూములు ఉన్నాయన్నారు. దేవస్థానానికి చెందిన 8.40 ఎకరాల పంట పొలాలకు మూడు సంవత్సరాల కౌలుకు గాను టెండర్, బహిరంగ వేలంను ఈ నెల 3న నిర్వహించగా దేవాదాయ అధికార్లు ప్రకటించిన ప్రారంభ వేలంపాట ధర అధికంగా ఉండడంతో వేలం పాడేందుకు ధరావత్తు చెల్లించిన రైతులు ముందుకు రాలేదు. దీంతో వేలం పాటను వాయిదా వేశారు. తాజాగా ఈ నెల 21న నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ అధికార్లు ప్రకటించారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా రూ. 3వేలు ధరావత్తు చెల్లించాలని, వేలం పాట పూర్తయిన వెంటనే హెచ్చు పాటదారుడు తొలి సంవత్సరం బిడ్ శిస్తు చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే టెండర్, బహిరంగ వేలంలో గ్రామస్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు. టెండర్, బహిరంగ వేలంపాటకు సంబంధించి మరిన్ని వివరాలకు ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

రోలుగుంటలో...

రోలుగుంట: స్థానిక శ్రీ వేంకటేశ్వర, శ్రీ సీతారామ స్వామి దేవాలయాలకు చెందిన దేవదాయశాఖ భూములను కౌలుకు ఇచ్చేందుకు 21వ తేదీ ఉదయం సీతారామ స్వామివారి దేవస్థానం ఆవరణలో మూడు సంవత్సరాల కాలానికి సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి కె.బి.ఆశాకిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి...

కొవ్వూరు వెదుళ్లవలస రెవెన్యూలో 35/2 సర్వే నంబరులో 2.18 సెంట్ల పల్లం, 31 సర్వే నంబరులో 0.98 సెంట్ల మెట్టు, 35/4 సర్వే నంబరులో ఒక ఎకరా పల్లం భూమికి వేలం నిర్వహించనున్నారు. సీతారామ స్వామి వారి దేవస్థానానికి సంబంధించి ...రోలుగుంట రెవెన్యూలో 117/2,3 సర్వే నంబర్ల పరిధిలో 3.70 సెంట్ల పల్లం, ఇదే రెవెన్యూలో 210/2ఎ సర్వే నంబరులో ఎకరా మెట్టు, కొండపాలెం రెవెన్యూలో 14 సర్వే నంబరులో 1.90 సెంట్ల పల్లపు భూమి, నర్సీపట్నం మున్సిపాల్టీ పరిధిలో గల పెదబొడ్డేపల్లి రెవెన్యూలో గల 295 సర్వే నంబరులో గల 0.31 సెంట్ల మెట్టు భూమికి బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ పాటలో పాల్గోదలచిన పాటదారులు ముందుగా రూ.5,000 ధరావత్తు చెల్లించాలని తెలిపారు. మరిన్ని విషయాలకు 6303780935 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

సత్యనారాయణ స్వామి ఆలయ భూములు...

రోలుగుంట: మండలంలోని కంచుగుమలలో గల శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం భూములను కౌలుకు ఇచ్చేందుకు ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు కార్యనిర్వహణాధికారి కె.బి.ఆశాకిరణ్మయి ఓ ప్రకటనలో తెలిపారు.సర్వే నంబరు 18లో 1.10 సెంట్లు, 21/2 సర్వే నంబర్‌లో 1.12 సెంట్లు, 224/1 సర్వే నంబరులో 3.14 సెంట్ల విస్తీర్ణంలో గల పల్లపు భూములకు, సర్వే నంబర్ 1 లో 5.11 సెంట్ల మెట్టు భూమికి ఈ వేలం పాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5,000 ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గోవచ్చని చెప్పారు.

‘చెరువు కాలువ కప్పి రోడ్డు వేశారు...’



ఆక్రమణ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసిన తహసీల్దార్

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజాం గ్రామంలో వెంకటరావు చెరువు కాలువను కప్పేయడంపై గ్రామ రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంకటరావు చెరువు మీద ఆధారపడి 100 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇటీవల ఈ చెరువు అవతల భూములు కొనుగోలు చేసిన వ్యక్తి భూమిలోకి రోడ్డు వేయడానికి చెరువులోకి నీరు వస్తున్న పెద్ద గెడ్డ కాలువను పొక్లెయిన్‌తో కప్పివేసి రోడ్డు వేశారన్నారు. దీనివల్ల చెరువులోకి వర్షం నీరు చేరక దిగువ ఉన్న మా భూములకు సాగునీరు అందదని అన్నారు. అందువల్ల కప్పేసిన పెద్దగెడ్డ కాలువను తెరిపించి సాగునీరు అందేలా చూడాలని గ్రామానికి చెందిన చెరువు ఆయకట్టు రైతులు కంఠంరెడ్డి రాజారావు, ఆదినారాయణ, పారిపల్లి, చిలకరావు, శేఖర్ తదితరులు అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు.

ఆక్రమణ భూముల్లో బోర్డుల ఏర్పాటు

రాజాం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలను రెవిన్యూ అధికారులు తొలగించారు. గ్రామంలో గల సర్వే నంబర్ 328లో పలువురు ఆక్రమణలు చేయడంపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆదేశాలతో ఆర్ఐ శ్యామ్‌కుమార్, వీఆర్వోలు తులసీ, జేవీ రమణ తమ సిబ్బందితో వచ్చి భూ ఆక్రమణలను తొలగించి బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పలు రైళ్ల రీషెడ్యూల్.. గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధి పూండి-నౌపడా సెక్షన్ మధ్యలో జరుగుతున్న భద్రత పనుల దృష్ట్యా పలు రైళ్ల గమ్యం కుదించగా, మరికొన్ని రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.


నేడు పలాస పాసింజర్ గమ్యం కుదింపు

పలాస-విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్ గురువారం పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరనుంది. అలాగే విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం-పలాస(7470) పాసింజర్ స్పెషల్ పలాస వరకు కాకుండా శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

- బుధవారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరవలసిన సంత్రాగచ్చి-చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3 గంటల ఆలస్యంగా గురువారం తెల్లవారుజామున 2.40 గంటలకు బయల్దేరింది.
- గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరవలసిన భువనేశ్వర్-చెన్నై (12830) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటలకు బయల్దేరనుంది.

ప్రారంభమైన ఐటీఐ కౌన్సెలింగ్



విద్యార్థుల ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం (విశాఖ): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023-24 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి బుధవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. స్టీల్ ప్లాంట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డీఎస్ సునీత, ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 532 ర్యాంక్ వరకు అభ్యర్థులు పాల్గొనగా.. 230 మంది అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐల్లో అర్హత సాధించారు. రెండవ ర్యాంకర్ దివ్యకు ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడ్‌లో అర్హత పత్రాన్ని అధికారులు అందజేశారు. గురువారం 533 నుంచి 1278 ర్యాంక్ వరకు అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని కన్వీనర్ శ్రీకాంత్ సూచించారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులకు మంచినీరు, మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎ.రమణ, పి.వి.బాలాజీ, సిహెచ్ ఈశ్వరరావు, వంటాకుల శ్రీనివాసరావు, ఎ.జయలక్ష్మి ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

డ్రగ్స్ నివారణకు యాక్షన్ ప్లాన్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ ఖరారు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో అన్ని శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో డ్రగ్స్ నియంత్రణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై పూర్తి స్థాయిలో చర్చించి కార్యాచరణను సిద్ధం చేశారు. ప్రధానంగా సరిహద్దు జిల్లాల్లోను, ఒడిశా రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా నిర్మూలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించారు. డ్రగ్స్ దుష్పరిణామాలపై యువతలో చైతన్యం కలిగించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. స్నిఫర్ డాగ్స్‌తో నగరంలో నిత్యం తనిఖీలు నిర్వహించడం, ఇతర కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో నిర్ణయాలు

- ఎన్‌డీపీఎస్ నేరస్తుల బ్యాంక్ స్టేట్‌మెంట్‌ల సీడీఆర్‌లు, ఐపీడీఆర్‌లు, విశ్లేషణలు, నేరస్తుల ఎలక్ట్రానిక్ ఉపకరణాలను విశ్లేషించడానికి ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు.
- నేరస్తుల ప్రత్యేక విచారణ నివేదికల తయారు చేసి విశ్లేషించడం.
- గంజాయి మూలాలపై నిఘా పెట్టడం.
- ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం ఉండి రిమాండ్‌లో ఉన్న నేరస్తుల ములాకత్‌లపై ప్రత్యేక నిఘా.
- సముద్ర మార్గాలపై ప్రత్యేక నిఘా.
- హ్యాండ్ హెల్డ్ డిటెక్టర్, డ్రగ్ డిటెక్షన్ కిట్ సురక్షితంగా ఉంచడం.
- స్నిఫర్ డాగ్‌ల సేవలు, నార్కోటిక్స్‌ను గుర్తించేందుకు జాగిలాలకు శిక్షణ
- డ్రగ్స్ దుష్పరిణామాలపై షార్ట్ ఫిల్మ్, పోస్టర్లు, కరపత్రాలతో ప్రచారం.
- సెబ్ ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 14500పై విస్తృత ప్రచారం.
- డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీలు, మారథాన్ల నిర్వహణ.
- ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం ఉండి అరెస్టయిన నిందితుల ఛాయాచిత్రాలు, వేలిముద్రలను సేకరించి రికార్డులను భద్రపరచడం.
- బెయిల్ జంపర్లు, ఎన్‌డీపీఎస్ పీటీ కేసులపై ప్రత్యేక దృష్టి. ఈ సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 లక్ష్మీనారాయణ, డీసీపీ-2 ఎం.సత్తిబాబు, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శిక్షణకు వేళాయె

- భావి ఉపాధ్యాయులకు బంగారు భవిష్యత్
- నేటి నుంచి డీఎడ్ తరగతులు భీమునిపట్నం ప్రభుత్వ డైట్ కాలేజీలో
- ఈ ఏడాది మొదటి ఫేజ్‌లో 47 మందికి అడ్మిషన్లు



భీమునిపట్నంలోని ప్రభుత్వ డైట్ కళాశాల

విశాఖ విద్య : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కోర్సు ప్రవేశాలు పొందిన విద్యార్థులకు గురువారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. 2024-25 విద్యా వార్షిక క్యాలెండర్‌కు అనుగుణంగా పాఠ్యాంశాల బోధనపై విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. భావి ఉపాధ్యాయులుగా మారే క్రమంలో శిక్షణ కోసమని వస్తున్న విద్యార్థులకు తొలి రోజు స్వాగత వేడుక, పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించేలా డైట్ కాలేజీలో తగిన ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయ విద్య తీరుతెన్నులపై మూడు రోజులపాటు, డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులతో సూచనలు, సలహాలు ఇచ్చేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమునిపట్నంలో మాత్రమే ఉపాధ్యాయ(డీఎల్ఈడీ) శిక్షణ కాలేజీ అందుబాటులో ఉంది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల నుంచి విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

డీఎడ్ శిక్షణతో జాబ్ గ్యారెంటీ

రెండేళ్ల కాలవ్యవధితో కూడిన డిప్లమో ఇన్ ఎలిమెంటరీ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో త్వరితగతిన ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. ప్రీ ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు డీఎడ్ కోర్సు చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తుండటంతో వీటికి మంచి డిమాండ్ ఉంది. భీమునిపట్నం ప్రభుత్వ డైట్ కాలేజీలో నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులు పనిచేస్తుండటంతో విద్యార్థులకు నైపుణ్యతతో కూడిన శిక్షణ అందుతోంది. జాబ్ గ్యారెంటీ కోర్సు కావటంతో శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఏకైక కళాశాల

ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి భీమునిపట్నంలో డైట్ కాలేజీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ వంద సీట్లు అందుబాటులో ఉండగా, 2024-25 విద్యా సంవత్సరానికి మొదటి ఫేజ్‌లో 47 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రెండో విడత కౌన్సెలింగ్‌పై అధికారులు దృష్టి సారించారు.

క్లుప్తంగా

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు చెక్కును అందిస్తున్న జాజుల రమేష్, రుధిరారాణి

తుమ్మపాల: విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటి సాధనకు కృషి చేయాలని 83వ వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. పట్టణ జీవీఎంసీ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, హెచ్ఎం రుధిరారాణితో కలిసి విద్యార్థులను అభినందించారు. 2023–24 విద్యా సంవత్సరం టెన్త్ ఫలితాల్లో 500 మార్కులకు పైగా సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 34 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షుడు విల్లూరి హరికృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీబీ నాయుడు, మల్ల అప్పలనాయుడు, వేల్పుల గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు బీమా వర్తింపజేయాలి



కల్లుగీత కార్మికులతో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రినాథ్

తుమ్మపాల: కల్లుగీత కార్మికుడు సహజంగా మరణిస్తే రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు, గాయపడినా, అంగవైకల్యం ఏర్పడినా రూ.2 లక్షలు బీమా సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ అన్నారు. కొత్తగా గీత వృత్తి చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేయాలన్నారు. కంపెనీలు, ప్రాజెక్టులు నిర్మాణంలో పరిసర ప్రాంతాల్లోని తాటి చెట్లను తొలగించడం వల్ల గీత కార్మికులు ఉపాధికి కోల్పోయి, నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. తాటి చెట్లు లేకపోతే గీత కార్మికుల బతుకులు ప్రశ్నార్థకమని, రైతులు తాటిచెట్లను వేసేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రతి గీత కార్మికుడికి ఎకరం భూమి అందించాలని, భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్ల వయసు నిండిన గీత కార్మికుడికి గీత కార్మిక సంక్షేమ బోర్డు నుంచి రూ.50 వేలు అందించాలని కోరారు.

కూటమి శ్రేణుల సంబరాలు



పవన్‌కల్యాణ్ పదవీ స్వీకరణ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కూటమి శ్రేణులు, అభిమానులు

కశింకోట: ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కూటమి శ్రేణులు, అభిమానులు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బుదిరెడ్డి మోహన్, వేగి రామకోటేశ్వరరావు, దాడి నాగరాజు, చిన్ని జనార్దన్, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తాకాశి కృష్ణ, పెంటకోట రాము, పి.సంతోష్, ఎం.మోహన్, రాజారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో వరి విత్తనాలు



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో రంగాచారి



కశింకోటలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

తుమ్మపాల: ఖరీఫ్‌లో సీజన్లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు అన్ని రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి పీయూబీ రంగాచారి తెలిపారు. మండలంలోని కూండ్రం గ్రామం ఆర్బీకేలో బుధవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా తమ వివరాలను ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులు కూడా విత్తన మొలక శాతం పరీక్షించాకే, విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌లో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్టను దమ్ములో కలియదున్నటం ద్వారా ఎరువుల వినియోగం తగ్గి, మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ ఏడాదిలో వర్షాలు ముందు నుంచి పడటంతో రైతులు చాలా వరకు ముందుగానే దుక్కులు పూర్తి చేసి, పంట పొలాలను సిద్ధం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నందారపు లక్ష్మి, సూరిబాబు, ఎంపీటీసీ జెట్టి నాగమణి, అప్పారావు, పచ్చికూర రాము, సేనాపతి ఈశ్వరమ్మ, నాయుడు, ఉపసర్పంచ్ వారాది సన్యాసమ్మ, అభ్యుదయ రైతులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కశింకోట: అన్నిరైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం.రామారావు అన్నారు. కశింకోటలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధికార, విపక్ష పార్టీలకు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు రాజకీయాలకు అతీతంగా కలిసి, కార్యక్రమంలో మాట్లాడారు. రాయితీపై అందిస్తున్న ఆర్‌జీఎల్(శ్రీకాకుళం సన్నాలు)–2537, సాంబమసూరి, సోనామసూరి, మరుటేరు సాంబ ఎంటీయూ–1318 రకాల వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈ విత్తనాలను కిలోకి రూ.10 వంతున మండలంలోని రైతులకు రూ.6.69 లక్షల రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరం మేరకు ఇప్పటికే ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద రైతులకు సాయంగా 17వ విడత నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు వీటిని జమ చేసినట్లు తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయినదీ, లేనిదీ పరిశీలించుకోవాలని సూచించారు.

ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అండగా నిలిచిరాని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి దోహదపడాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, మండల మాజీ ఉపాధ్యక్షుడు ఉగ్గిన రమణమూర్తి, జనసేన ప్రతినిధులు నిమ్మదల సన్యాసినాయుడు, పందల ఎల్లయ్యనాయుడు, కర్రి వెంకటసత్యనారాయణ, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, టీడీపీ మండల నాయకులు పెంటకోట రాము, నైనంశెట్టి రమణారావు, ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు సమర్పిస్తున్న భక్తులు

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయ సప్తమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బోగాపురపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ బిల్డర్, సంఘ సేవకుడు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు, మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. అనంతరం స్వామి వారి విగ్రహానికి మంగళ స్నానాలు చేయించి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి కల్యాణంలో భీశెట్టి సంతోష్, కోమలి, పాలమరశెట్టి వెంకట సూర్యనారాయణ, నవ్య దంపతులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీప రమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



రిక్షా కార్మికులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కశింకోట: అనకాపల్లిలోని ఉడ్‌పేట వద్ద ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్ని ఆ పార్టీ నేతలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిక్షా కార్మికులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి పరిశోధన సమన్వయకర్త బోయిన భానుమూర్తి, పీసీసీ సభ్యుడు తుట్టా రమణ, పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, సత్యనారాయణస్వామి దేవాలయ మాజీ చైర్మన్ సేనాపతి ఈశ్వరరావు, సుబ్బరామిరెడ్డి సేవా పీఠం మాజీ సభ్యుడు కోట్ని మాణిక్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వేగి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పనుల్లో ఉంటే చర్యలు

- 'నేను బడికి పోతా' అవగాహన సమావేశంలో ఎంపీడీవో మురళీమోహన్‌కుమార్



విద్యాశాఖ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మురళీ మోహన్‌కుమార్

తుమ్మపాల: బడి ఈడు పిల్లలందరూ పాఠశాల సమయంలో బడిలోనే ఉండాలని, బడి బయట ఉన్న పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ఆ పిల్లలను బడిలో చేర్పించేలా చూడాలని విద్యాశాఖ మండల స్థాయి కమిటీ చైర్మన్, ఎంపీడీవో మురళీమోహన్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలంతా పాఠశాలలోనే ఉండాలన్నారు. ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందన్నారు. పాఠశాలల్లో మంచి సౌకర్యాలతో పాటు నాణ్యమైన చదువును కూడా అందిస్తున్నామన్నారు. 14 ఏళ్లలోపు వయసున్న పిల్లల్ని బాల కార్మికులుగా తయారు చేసే వ్యవస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో–1 ఒ.చిట్టిబాబు, ఎంఈవో–2 జి.కోటేశ్వరరావు, సీడీపీవో శశికళ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ లక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అవగాహనతోనే సికిల్ సెల్ నియంత్రణ



తాళ్లపాలెం పీహెచ్‌సీలో సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీలో తుమ్మపాల పీహెచ్‌సీ సిబ్బంది

కశింకోట: సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు అంతా సమష్టి బాధ్యతగా కృషి చేయాలన్నారు. దీని బారినుంచి బయటపడేందుకు చికిత్స, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంత ముందుగా దీన్ని గుర్తిస్తే అంత వేగంగా నివారించవచ్చన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వీఏ సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల: సికిల్ సెల్ వ్యాధి(రక్తహీనత) నిర్మూలనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైద్యురాలు డాక్టర్ సుస్రీత్ షమీమ్ తెలిపారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 2047 నాటికి రక్తహీనత పూర్తిగా నిర్మూలించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అధికంగా గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో 0 నుంచి 40 ఏళ్ల వయసున్న వారికి నిర్ధారణ పరీక్షలు చేసి, అవగాహన పెంచే చర్యలు చేపట్టిందన్నారు. రక్తహీనత అనేది ఎర్రరక్త కణాల రుగ్మతల సమూహమని, శరీరంలో ఆక్సిజన్ సరఫరా క్షీణించడం ద్వారా కణజాలం, అవయవ నష్టాలు జరుగుతాయన్నారు. రక్త ప్రసరణలో అడ్డంకులు ఏర్పడి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయన్నారు. రక్తహీనతతో కళ్లు పసుపు రంగులో మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట, అంటువ్యాధులు, గర్భధారణ సమస్యలు తదితర లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.సంగం, హెచ్‌వీ ఎం.మరియమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత



పాఠశాల యాజమాన్యానికి ప్రింటర్ అందజేస్తున్న మంత్రి జగన్నాథరావు

పరవాడ: దివంగత యలమంచిలి కృష్ణ ప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన తనయులు వై.వి.ఆదిత్య, వై.వి.ఆదర్స్ రూ.14000 విలువ చేసే ప్రింటర్‌ను బుధవారం పరవాడ జెడ్పీ బాలికల పాఠశాలకు లయన్ మంత్రి జగన్నాథరావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నలుగురు టాపర్లకు నగదు పారితోషకం అందజేశారు. జెడ్పీ పాఠశాల ఆవరణలో మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీడీవో మన్మథరావుకు వినతి అందజేస్తున్న ఉపాధి కూలీలు

మునగపాక : పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ ఉపాధి హామీ పథకం కూలీలు బుధవారం ఎంపీడీవో ఎం.మన్మథరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ మాట్లాడుతూ గత ఐదు వారాలుగా వేతనాలు రాక ఉపాధి హామీ పథకం కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పనిచేసే ప్రాంతాల్లో కనీస వసతులు కూడా లేవన్నారు. పనిదినాలను 200 రోజులకు పెంచడంతో పాటు రోజుకు రూ.600 కనీస వేతనం అందించేలా చూడాలన్నారు. ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందించిన వారిలో రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, కూలీలు పెంటకోట వెంకట పూర్ణ సత్యనారాయణ, వేగి ఆది సూరప్పారావు, ఆడారి నూకప్పారావు, దాడి సత్తిబాబు, పి.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం కుమార్ సేవలు ఆదర్శనీయం



తోటాడ హైస్కూల్ రిటైర్డ్ హెచ్ఎం కుమార్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ అన్నారు. తోటాడ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన బి.కుమార్ దంపతులను బుధవారం హైస్కూల్ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని, అలాగే హైస్కూల్ అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి సేవలందించిన కుమార్‌ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పెద్దలు దొడ్డి బాలాజీ, షేక్ ఇస్మాయిల్, కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణంరాజు కాలువపై దెబ్బతిన్న రెయిలింగ్



కాలువపై రెయిలింగ్ దెబ్బతిన్న ప్రాంతం

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో కృష్ణంరాజు కాలువపై రెయిలింగ్ దెబ్బతినడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి ద్వారా పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామంలోకి వెళ్లేందుకు వీలుగా నిర్మించిన బ్రిడ్జికి సంబంధించిన రెయిలింగ్ దెబ్బతినడంతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. నిత్యం వందలాది మంది ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత రెయిలింగ్ పరిస్థితుల పట్ల ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని కలవరపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా రెయిలింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ సుజాత ముత్యాలు

పరవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు పిలుపునిచ్చారు. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం సర్పంచ్ సుజాతముత్యాలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారికి అవసరమైన బ్యాగులు, పుస్తకాలు సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, పంచాయతీ కార్యదర్శి పి.రమేష్, సచివాలయ సిబ్బంది కె.దిలీప్ కుమార్, పాఠశాల హెచ్ఎం బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో సుందరీకరణ పనులు

అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో సుందరీకరణ పనులు బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేష్‌కుమార్ పర్యవేక్షణలో అచ్యుతాపురం జంక్షన్ పరిసరాలను పరిశీలించారు. రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగింపు, డ్రైనేజీల మరమ్మతులు, రోడ్డు పక్కన మొక్కలు నాటడం వంటి పనులను నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఇటీవల అచ్యుతాపురం జంక్షన్‌ను పరిశీలించి ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో అధికారులు కమిటీగా ఏర్పడి సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు సమాచారం.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 257 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,500
రెండో రకం	4,300	4,380
మూడో రకం	3,190	3,190

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
గ్యాంగ్ ఆఫ్ గోదావరి	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

నిత్యావసర సరకుల వితరణ



పేదలకు,వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సుకుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడలో కృప సహకార కేంద్రంలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా బుధవారం పేదలు, వృద్ధులకు నగదుతో పాటు నిత్యావసర వస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇరువాడతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన పేదలు,వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులకు అల్పాహారం ఏర్పాటు చేసి వారికి నిత్యావసర సరకులతో పాటు ప్రయాణ ఖర్చులు అందించారు. ప్రతి నెల 30 మంది వరకూ నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నట్టు విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుకుమార్,నిర్మల , ట్రస్టు కో ఆర్డినేటర్ స్టెల్లీ, కార్యదర్శి ఎస్. దివ్యతేజ, ట్రెజరర్ సూరిబాబు,వై. రమ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక వికాసం



చినదొడ్డిగల్లు పాఠశాల విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రాంబాబు

నక్కపల్లి : యోగా మంచి ఔషధం వంటిదని, యోగాతో ఆరోగ్యం, జ్ఞానం పొందవచ్చని యోగా ట్రైనర్ డి.రాంబాబు అన్నారు. బుధవారం చినదొడ్డిగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు యోగాలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పదిరోజుల పాటు ఇక్కడ విద్యార్థులకు యోగాలో వివిధ ఆసనాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మానసిక వికాసంతో పాటు, మంచి జ్ఞానాన్ని, జ్ఞాపకశక్తిని, సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగాను నేర్చుకోవాలని విద్యార్థులకు వివరించారు. వివిధ ఆసనాలను నేర్పించారు. విద్యార్థులే కాకుండా వారి తల్లిదండ్రులు కూడా యోగా నేర్చుకోవచ్చన్నారు. యోగా తరగతులను చినదొడ్డిగల్లు పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ వ్యవస్థాపకులు ఏడిద వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ ఆదిలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్ట్

సబ్బవరం: పరవాడ మండలంలో పెదముషిడివాడ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన దాడి గంగా భవాని నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పి దుర్గాప్రసాద్ తెలియజేశారు. తనిఖీలు నిర్వహించిన వారిలో ఎస్ఐ రాజశేఖర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

రెండు వారాల్లో ఇది మూడోసారి

ఆరిలోవ: సముద్రంలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతిని ఆరిలోవ పోలీసులు రక్షించారు. తెన్నేటిపార్కు వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లికి చెందిన ఓ మూగ యువతి, నగరానికి చెందిన మూగ యువకుడు వాల్తేరులోని చెవిటి, మూగు స్కూల్‌లో చదువుకున్నారు. ఆ సమయంలోనే వారిద్దరూ ప్రేమించుకున్నారు. ప్రస్తుతం ఆ యువతి అనకాపల్లిలో ఉంది. కొద్దిరోజుల కిందట విశాఖ వచ్చి ఆ యువకుడిని కలిసింది. ఏమైందో గానీ బుధవారం సాయంత్రం తెన్నేటి పార్కు వద్ద సముద్రంలో దిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన సందర్శకులు కేకలు వేశారు. అక్కడకు సమీపంలోని జోడుగుళ్లపాలెం అవుట్ పోస్ట్ పోలీసులు వెంటనే స్పందించి యువతిని రక్షించి స్టేషన్‌కు తరలించారు. అనకాపల్లిలో ఉన్న ఆమె తల్లిదండ్రులను రప్పించి అప్పగించారు. యువకుడిని ప్రేమించిన వ్యవహారంలో ఎంత చెప్పినా తమ మాట వినడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు చెప్పి.. ఆ యువతిని తీసుకెళ్లారు. కాగా.. రెండు వారాల్లో ఆ యువతి మూడుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.మొదట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి, ఈ నెల 13న ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ గోవిందరావు వివరించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ దుర్గాప్రసాద్

సబ్బవరం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్ఈబీ సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. జోడుగుళ్ల సమీపంలోని మదర్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల దినచర్యను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.